అపరాధ పరిశోధన

# రైల్లో డిటెక్టివ్


## (డిటెక్టివ్ కేయాస్‌గారి మద్రాసు ప్రయాణం)

టి. వి. శంకరమ్

పట్నం పోదామని భద్రం నా ప్రాణాలు కొరుక్కు తింటున్నాడు. వాడికి అడపా దడపా ఎగస్ట్రా వేషాలు వెయ్యకపోతే ప్రాణం నిలవదు. కులి. బీడీ తాగటం మోస్తరే. అలవాటైన ప్రాణమంటారే—అదీ.

"అమ్మ మంచిగా ఉన్న సమయం చూసి డబ్బు పుచ్చుకుని బయలుదేరదాంలే, భద్రం!" అన్నా.

"అమ్మగారు ఎంతమంచిగా ఉన్నా డబ్బడగగానే ఆ మంచి కాస్తా ఎగిరిపోతుంది గద, గురో!" అన్నాడు భద్రం.



"అయినా అంతకంటె ఉపాయం లేదు భద్రం! మనం హోర్సుగా ఉంటే వావ కాశం దొరక్కపోదు," అన్నా.

"అ-హాం తేలే, గురో!" అన్నాడు భద్రం.

భద్రం నొచ్చుకున్నాడు. నేడు డిటెక్షన్ చెయ్యగలను.

"నెల రోజుల్నించీ లేని తొందర ఇప్పుడేం వచ్చింది, భద్రం? పట్నం పోవాలంటే ఎంతసేపు?" అన్నా.

"రైలెక్కితే పది గంటలే గురో! కాని రైలెక్కటానికో? వారాలు! నెల్లు! ఏళ్ళు!"

"పెళ్ళొద్దుగాని, ఒక్క నెలాగు! అట్టాగే పోతాం."

"కారినివాలా. ఎగిజ్బిషనూ దాటిపోయినాక పోయేం, పోకేం?"

"కారిని—?"

"—వాలా!"

"వాడెవడూ? డిటెక్టివా?"

"కాదు, గురో! సంబరమన్నమాట."

"మంగళగిరి తిరణాలల్లేనా?"

"మంగ—! దానికీ దీనికీ పోలికేంటి, గురో?"

"అంతేనా?"

"మరేంటి, గురో?"

"యెగ మోహనన్నావే? అదేంటి?"

"అదీ ఓ తిరణాలే!"

"ఒకటే జనమన్నమాట?"

"ఇసకెయ్యటానికుండదు."

"ఎన్నో హత్యలు! ఎక్కడ చూసినా అంతకులు! అంతేనా, భద్రం?"

"అంతేనా? ఎక్కడ చూసినా యెర్ర టోపీలు, సబ్బులు, సర్కిళ్ళు, సూటర్లు!"

"ఇవి ఇప్పుడు జరుగుతున్నయ్యా భద్రం?"

"ఎల్లుండే ఆరంభం, గురో! అందుకేగా నా ప్రాణం కొట్టుకుపోతోంది?"

"నేన్నిక చాలా హాస్యాయం చేశాను భద్రం!"

"అదేం లేదులే గురో!"

"నువు ఎగస్ట్రా వేషాలకోసం హాతహాతలాడిపోతున్నావు అనుకుంటున్నానులే భద్రం!"

"సీత్!"

"అయితే యివి—అదే, ఆ కానీవాలా, యెగ మోహన్—ఎప్పటిదాకా ఉంటయి?"

"ఒక నెలుంటయి గురో!"

"అయితే బయల్దేరాల్సిందే!"

"హాత్తెరి!"

"కాని డబ్బెట్లా? అమ్మ ఇవ్వదేమో?"

"డిటెక్టివ్ కేయాస్ గారికి ఒకరు డబ్బివటమా గురో? నాకు చాలా యిదైపోతోంది!"

అదీ నిజమేమరి. పెట్టెలో ఉన్న డబ్బు తీసుకోవటమే చాతగాక డిటెక్టివు అంతకుల్ని ఏం పడతాడూ?

"చూడు భద్రం ... మామూలుగా అందరి డిటెక్టివుల్లే కాకుండా మన కీడబ్బు దరిద్రమేంటి? డబ్బుకోసం జేబులో చెయ్యి పెట్టిన డిటెక్టివు నెక్కణ్ణా చూశావ్?"

"లేదు, గురో!"

"ఎందుకు చూస్తావ్? అట్లా ఉండకేగూడదు. డిటెక్టివన్నవాడికి డబ్బుతో పనుండరాదు. కారులో పెట్రోలూ, వంటింటో కాఫీ పొడుమూ అయిపోటమంటూ ఉండకూడదు. ఏమంటావ్ భద్రం?"

"సందేహమేంటి గురో?"

"మరి మనకీ ఖర్మేంటి? ఆనాడు వాడెవడో పావలా ఇస్తాడంటే కేసొదులుకోవటానిక్కూడా నువు సిద్ధపడ్డావా, లేదా? కాఫీకి లేకేనా?"

"ఆదేమంత కేసులే గురో?"

"అదే నే వప్పను. అందులో మిష్టరీ లేదంటావా? ఆడ శవం మగ శవం ఎట్లా అయింది? శవం లేచి యెట్టా పారిపోయింది? ఈ మిష్టరీ ఇంకా విచ్చలేదు."

"రెండు కప్పులు కాఫీ పొట్టలో పడితే దాని కదే విచ్చేది గురో! ... ప్రయాణం కరారన్న మాటేగా?"

"పెట్టెలో డబ్బుంది, నిజమే. అమ్మదగ్గిర తాళాలున్నమాటా నిజమే. నన్నేం చెయ్యమంటావో నువే చెప్పు. ఆగు! తాళాలు అడగమంటే అడిగేదిలేదు. నన్ను సవాళ్ళేస్తుంది. నాకు చెడ్డ మండిపోతుంది. డిటెక్టివయినవాడు అడుగుతాడుగాని, చెప్పడు. ఏమంటావ్?"

"అది కాదంటమెట్టా?... మీ రడక్కుండా మీ చేతికి తాళాలొస్తే సరేనా?"

"కాని ఆ వొచ్చేదెట్టా?"

"అదంతా అడగొద్దు, గురో?"

"ఇందులో నీ మిష్టరీ కొంతా?"

"ఎంత చెడ్డా అసిస్టెంటును గదా, గురో?"

భద్రం అన్నంత పనీ చేశాడు. సాయంత్రం అమ్మ పురాణానికి వెళ్ళిన మరుక్షణం వాడు పెట్టె తాళం తెచ్చి నాకిచ్చాడు. నేను గంభీరంగా వెళ్ళి పెట్టె తెరిచి నాక్కావలిసిన డబ్బు తీసుకుని పెట్టె మూసివచ్చి, తాళాలు మళ్ళీ భద్రానికి భద్రంగా ఇచ్చా.

"ఎంతుంది, గురో?"

"రెండొందలు."

"ఇంకో ఇరవై రెండు ముచ్చవకుండాలే గురో?"

"హాశ్చర్యం!" అన్నాను, నా కళ్ళను నేనే నమ్మలేకుండా. "ఎట్లా పట్టేశావు, భద్రం? ఇన్ని డిటెక్టన్లు చూశాగాని ఇంత డిటెక్ట నెక్కడా చూళ్ళేదే? నన్నే మించిపోతావా ఏంటి?"

"అంత మాటెందుకులే, గురో? ఎంత జేసినా అసిస్టెంటసిస్టెంటే, కేయాన్ కేయానే!"

హోల్ డిటెక్టివ్ ప్రపంచం మొత్తంమీద నాయంటి డిటెక్టివుగాని, భద్రంవంటి అసిస్టెంటుగాని లేడని ఆ తక్షణాన నాకు ఢంకామీద బజాయించి చెప్పగల ననిపించింది.

"మరి రైలుకు కొంచెం ముందెళితేనే మంచిది గదా, గురో?"

"రై లెన్నింటికి?"

"తెలీదు, గురో!"

"అయితే పోదాంపద!"

## 2

స్టేషనునిండా లుకలుకలాడుతూ జనం! ఏ కారణంతోగాని నాకు కానామంది జనాన్ని చూస్తే చీమలమీద జెర్రులు పాకినట్టుంటుంది. తప్పనిసరి విధిగా అంతమందిని చూసినప్పుడు వాళ్ళందర్నీ డిటెక్షన్ చేసి పారేస్తే పీడా పోతుందనిపిస్తుంది.

టిక్కెట్టులు తీసుకునే కిటికీదగ్గిర తోసుకుచస్తున్నారు. నేను చూస్తుండగానే ఒక ముచ్చటముడివాడు ఒక బక్కవాణ్ణి డొక్కలో ఒక్కటిచ్చుమన్నాడు. బక్కవాడు కుంయోమని ఇవతల వచ్చి పడ్డాడు. ముచ్చటముడివాడు టిక్కెట్టూ, చిల్లరా తీసుకుని బీడీ వెలిగించుకుంటూ ప్లాటుఫారం మీదికి వెళ్ళిపోయినాడు.

నేను బక్కవాడి దగ్గిరికిపోయి. "నీ పేరేంటి?" అని అడిగాను.

"ఉండవయ్యా, నీదో సొదా! అన్నాడువాడు.

"నే నెవరో తెలుసా? డిటెక్టివ్ కేయాన్! నా ప్రశ్నలకు సమాధానం చేప్పావంటే నిన్ను డొక్కలో పొడిచినవాడి ఆచోకీ కనిపెట్టి పోలీసులకు పట్టిస్తాను. చెప్పు, నీ పేరు?"

"యెంకటేశ్వర్లు."

"అయితే నిన్న డొక్కలో పొడిచినవాడి పేరు గోవిందయి ఉంటుంది. ఏ డొక్కలో పొడిచాడు?"

"కుడి డొక్కలో!"

"అయితే వంతెన ఎక్కి బయటికి పోయుంటాడా! లేక ఈ కటకటాల సందున నుంచు నుంటాడా? ఏదీ నువు నాకు కొన్ని క్లూలివ్వాలి. అని లేందీ ఎంత లావుపాటి డిటెక్టివు కూడా అంతకుడి ఎత్తూ, నడకా, పోయిన దిక్కూ తెలుసుకోలేడు. కనక క్లూలు నీ దగ్గిర ఎన్ని ఉంటే అన్నీ గబగబా ఇచ్చెయ్యి!"

"పోవయ్యా, నీదో గొడవా!" అన్నాడు బక్కవాడు, వొంతెనవేసి నడుస్తూ వాడు కాస్త కలిసి వచ్చినట్టయితే అంతకణ్ణి అప్పటికప్పుడే పోలీసు కుక్కల్లే పట్టేసి ఉండేవాణ్ణే. డిటెక్టివు కావాలని ఏ పాపిష్టివేళ అనుకున్నానోగాని అందరి డిటెక్టివులతో కలిసొచ్చినట్టు నాతో ఒక్కరూ కలిసి రారాయె.

ఈ విధంగా నేను ఆలోచిస్తున్న సమయంలో, "పదండి, గురో!" అంటూ టిక్కట్టు తీసుకుని నా అసిస్టెంటు భద్రం వచ్చేశాడు. వాడి వాలకం చూస్తే ఇద్దరు అంతకులను తప్పించుకు వచ్చినట్టుగా ఉంది.

"రెండూ తీశావా?"

"తీశాను, గురో!"

"పట్నానికేనా?"

"పట్నానికే, గురో!"

"కాస్కోండిరా, పట్నం డిటెక్టివులు!"అన్నాను బిగ్గిరిగా నవ్వుతూ.

"కాకపోతే యేంటి గురో! మనం అట్టా వెళ్ళి రిఫ్రెష్మెంట్రూంలో ఇంత కాఫీ పొయ్యాలె!"

"పద, భద్రం! అంతకంటె కూడానా!" అన్నాను.

మేం కాఫీ తాగి బయటికి వచ్చామో ఇంకా రాలేదో పెద్దచప్పుడు చేసుకుంటూ రైలు తీవ్రంగా వచ్చేసింది. నేను ఒక పెట్టెలోకి ఎక్కేశాను. భద్రం నావెంటే ఎక్కాడు. బెంచీలన్నీ జనంతో లుకలుక లాడుతున్నాయి. నేను ఎగిరి గంతేసి పైన ఉండే బెంచీలమీద పెట్టిన పెట్టెలమీద పడుకున్నాను. వెల్లికింతలా పడుకుంటే నాకు చోటు సరిపోయింది. పక్కకు ఒత్తిగిలటానికి లేదు. కింద ఏం జరుగుతున్నదీ వినిపిస్తున్నది మటుకే.

"అంతసోటూ నీకేనెట్టా?...సామాను ఎక్కనట్టేనా?...ఇక మీరుండండి, మామయ్యా!... రెయిలీ టేసనిలో ఎంతసేపాగుతదీ?...ఇదేంపూరో? ఎక్కడికి పోతయ్యండీ? జేబులోనే పెట్టుకునుంటారు. ముందు చోటు చూసుకోండి... దారిలో ఎక్కడైనా పడిపోయ్యాయా? ఎళ్ళి చూసొస్తా!...వొద్దు, వొద్దు! గంటకొట్టారు! అదుగో కూసింది...కిటికీలోంచి దూకి సస్తావంట్రా! (ఫెడేల్!) మాయసచ్చినాడా! (పిల్లాడి ఏడుపు)."

ఇదంతా వాలకిస్తున్నాను. కాని ఒకటీ కనిపించదు రైలుపెట్టె కప్పుతప్ప. పట్నందాకా పోవాలి. ఊరికీ ఆ కప్పుకేసి చూస్తుంటే ఏం తోస్తుంది? క్లూ లేమన్నా కనిపిస్తాయేమోనని భూతద్దం కోసం "భద్రం!" అని పిలిచాను. జవాబు లేదు.

భద్రం ఏమయ్యాడు? క్లూలు చూట్టానికి లేక పోగా ఇదో మిష్టరీయా? వాగోరించినట్టే వుంది!

## 3

నేను నిద్రపోయానా? డిటెక్షన్ చేసి చూసుకుంటే పోయానల్లేనే ఉంది.

"టికెట్టికెట్టికెట్!"

"ఓయూ వయ్యావ్? వా యెవరయ్యావ్? అమీన పడుకుండయినా! టిక్కంటంట సూపియ్, అదుగు తుండాడు!...మనిసికి నెవ్వుడెట్టా!"

"ఏయ్, మిష్టర్!" మీద ఎవరిదో చెయ్యి పడింది. "మిష్టరీ!" అంటూ కిందికి పడిపోయాను.

"నీ టికెటెక్కడ?' అని అడిగాడు, టిక్కట్టు కలెకటరని వెంటనే పోల్చేశా. తీవ్రంగా ఆలోచించి, "భద్రం దగ్గిర ఉండి ఉంటుంది. కావలిస్తే పోయి చూసుకో!" అన్నా, చిరునవ్వుతో.

"వాడెవడు?"

"నా అసిస్టెంటు," అన్నా సూటిగా.

"ఏడీ?"

"అదే మిష్టరీ! నాకింకా క్లూలు దొరకలేదు!"

"వేళాకోళమనుకున్నావా? టిక్కట్టు చూపించు! లేకపోతే పేరు రాసుకుని దింపేస్తా!"

"నా పేరేమిటో తెలిస్తే అట్టా అనవ్."

"ఏమిటి నీ పేరు? ఎక్కణ్ణించి వస్తున్నావు? ఎక్కడికి పోతున్నావు?" అంటూ కలెక్టరు నోటు బుక్కు తీశాడు.

"ఆ వివరాలన్నీ నీకు అనవసరం. టిక్కెట్లు భద్రం దగ్గిరున్నయ్యని చెప్పాను. అంతే!" అన్నాను కఠినంగా.

"అవునండీ! ఈన వెనకాలే ఇంకో అబ్బాయెక్కి వుళ్ళా దిగి వెళ్ళాడు. వేరే పెట్టెలో ఎక్కుంటాడు" అని పెట్టెలో ఎవరో కలెక్టరుతో చెప్పారు

"సరే, అట్లాగే వుండు, నీసంగతి తరవాత చూస్తా" అంటూ కలెక్టరు మిగిలినవాళ్ళ టిక్కెట్లు చూడటం సాగించాడు.

అవతలి బెంచీమీద ఒక యువకుడూ, ఒక యువతీ ఉన్నారు. యువకుడు చాలా కంగారు పడిగా దేనికోసమో వెతుకుతున్నాడు. కలెక్టరు దగ్గిరికి రాగానే "మా యిద్దరి టిక్కెట్లూ ఎక్కడో జారిపోయినట్టుందండీ. రైలు కదలకముందునుంచీ వెతుకుతున్నాం" అన్నాడు.

"ఎక్కడెక్కారు? ఎక్కడికి పోతున్నారు?"

వాళ్ళు పాపం మాతోపాటే ఎక్కి పట్నం వస్తున్నారు. ఆ సంగతి తెలియగానే నాకు వాళ్ళను చూసి జాలేసింది. కొంచెం డిటెక్షను చేసి వాళ్ళ టిక్కెట్లు ఏమయాయో తెల్సుకుందామనిపించింది.

"మా టిక్కెట్లు నంబర్లు 815, 816 కాస్త నోట్ చేసుకోండి" అన్నాడు యువకుడు. "డోన్ట్ వర్రీ!" అని ఇంగిలీషులో ఏదో అని కలెక్టరు ఇంకోరి దగ్గిరికి వెళ్ళాడు.

నేను మెల్లిగా ఆ యువకుడూ, యువతీ ఉన్న చోటికి వెళ్ళి యువకుడితో, "మీ పేరు?" అన్నాను.

"నా పేరుతో నీకేంపని?"

"ఆగ్రహించకూడదు. నేను డిటెక్టివ్ కేయాన్‌ను. మీ టిక్కెట్లు ఎవరన్నా పిక్కుపాకెట్టు చేసి ఉంటే ఆ అంతకుణ్ణి పట్టేస్తాను."

ఆనందంతో నవ్వి ఆ యువకుడు, "నా పేరు రాజసహస్రం. మాది అమృతామలక పురం. నేను లోయర్ కోర్టులో హైయర్ క్రీఫ్‌టేకరుగా పని చేస్తున్నాను. దయచేసి నా టిక్కెట్టులకు వచ్చిన యిక్కట్టులు తెలుపండి!"

పసవైన డిటెక్టివుతో మాట్లాడే పద్ధతి అదీ!

"ముందు నాకు ఒక్కటి మీరు తెలుపవలసి ఉంటుంది. ఆ వివరాలు దొస్తే ఈ కేసులో నేను కాదుగదా, నాకన్న చిన్న డిటెక్టివుకూడా ఏమీ చెయ్యలేడు. మీరా టిక్కెట్లు ఎప్పుడుకొన్నారు?"

"రైలు బయలుదేరిన కాస్సేపటికల్లా!"

"రైట్. ఎక్కడ కొన్నారు?"

"సెకండ్ హాండ్ బుక్ స్టాల్లో!"

ఇవన్నీ రాసుకునేందుకు భద్రం ఉంటే ఎంత బాగుండును! అన్నట్టు భద్రం ఏమైనట్టు? మిస్టరీ! హుఁ!

"మాకు టిక్కెట్లిచ్చిన వాడి పేరు."

"బైబిల్ వేదుల మత్తన్నాచారి!"

"హుఁ!" ఆలోచిస్తున్నాను. నాకింకా కావలసిన వివరాలేమిటీ? "అప్పుడు మీపక్క ఎవరున్నారు?"

"జడభరతుడూ, అజగరుడూ, హోహో హుహూ అహోబిలాచారి!...అంతే, ఇంకెవరూ లేరు!"



"ఇప్పటికి వివరాలు చాలు. ఎల్లుండిసాయంత్రం లోపల మీ టిక్కట్టు లెక్కడ ఉన్నదీ సరిగా చెప్పగలననుకుంటాను. ఎక్కడున్నా సరే సందేహించకుండా నన్ను ట్రంకు చెయ్యండి."

యువకుడు చాలా గట్టివాడు! బోలెడన్ని క్షూ లిచ్చాడు.

## 4

మళ్ళీ మద్రాసు మహా పట్నం! జనం! బస్సులూ కార్లూ, జనం, మోతా, హారన్లూ, జనం! మిష్టరీ! భద్రం ఏమైనట్టు? డబ్బు కూడా వాడిదగ్గరే ఉండిపోయిందే!

"గురో!"

మిష్టరీ విచ్చిపోయింది. ఈ కేయాస్ కింకా అసిస్టెంటు యోగం వున్నది.

"ఎటు పోయావ్ ఫ్రూల్!"

"ఇంకా నయం, గురో? మీ రెటుపోయారో అని తెగ మిష్టరీ అయిపోయి నే నిదవుతుంటేను! పదండి బయటికి!"

"టిక్కెట్లు భద్రంగా ఉన్నయ్యా?"

"ఈగో!" అంటూ అరిచెయ్యి తీసి చూపించాడు.

"భద్రం! మిష్టరీ!" అన్నాను.

"ఏంటి, గురో?"

"వాటిమీద నెంబర్లు చదువూ?"

"815, 816. ఎందుగ్గురో?"

"ఆ నెంబర్లు ఎందుకు నాకు తెలిసినట్టున్నయ్యా?"

"ఏమో, గురో!"

"మిష్టరీ! సరే పద! తరవాత మిష్టరీ విప్పగొడదాం!"

మా టిక్కట్లు తీసుకున్న గేటు కలెక్టరు, "అట్లా పక్కగా నుంచోండి" అంటూ టిక్కట్లు మళ్ళీ ఇచ్చేశాడు. ఇంతలో అక్కడికి నాతో రైల్లో వచ్చిన యువతీయువకుడూ చేరారు. వాళ్ళవెంట ఆ కలెక్టరున్నాడు. గేటువాడూ, కలెక్టరూ ఏదో ఇంగ్లీషులో మాట్లాడుకున్నారు.

"ఏమండోయ్? ఎవరివీ టిక్కట్లు?'! అని భద్రం కేకేశాడు. అంతకు ముందు వాడి చేతిలో ఉండిన రెండు టిక్కట్లూ అంతదూరాన పడి ఉన్నయి. దూరంనుంచి కూడా వాటిమీద 815, 816 నెంబర్లు కనిపిస్తూనే ఉన్నాయి.

"అవి మనవి కదూ?" అన్నాను.

భద్రం నాకు కన్ను మలిపి, "మనవి ఎక్కడో పిక్‌పాకెట్టయి పోయాయిగా?" అన్నాడు.

యువకుడు చప్పున వెళ్ళి టిక్కెట్లు తీసుకొని నాకేసి కొరకొరా చూస్తూ బయటికి వెళ్ళిపోయాడు.

కలెక్టరు మా దగ్గిరికివచ్చి, "మీరిద్దరూ పచ్చి దొంగల్లాగున్నారే?" అన్నాడు.

"మా టిక్కెట్లెవరో కొట్టేసి మేం హాగో రిస్తుంటే, వచ్చి దొంగలమేంటి? యేంచేస్తాం! ఎక్స్క్యూజు చెయ్యండి!" అన్నాడు భద్రం.

ఇంతలో కలెక్టరుకు గేటువాడు తోడైనాడు. మమ్మల్ని పోలీసులకు పట్టించడం గురించి చాలాసేపు మాట్లాడుకున్నారు.

"అయ్యా, ఇందులో ఏదో తపావుతుంది. మేం దొంగల్ని పట్టే డిటెక్టివులం కాని దొంగలంకాం. రైలులో మాకు కొన్ని మిష్టరీలు జతపడ్డయ్యని నేనూ ఒప్పుకుంటాను. అంతమాత్రానికి మమ్మల్ని దొంగల నిందపెట్టడం పెద్దమనిషితారా కాదు!" అని గంభీరంగా అన్నాను.

"నువ్వు పిచ్చోడివని తెలుస్తూనే ఉంది. మరి వాడి మాటేంటి?' అన్నాడు కలెక్టరు.

"వాడిచేతులో నేనా టిక్కెట్టు చూశాను!" అని జలగల్లే మళ్ళా గేటువాడు పట్టుకున్నాడు.

"లెట్ దెమ్ గో టూ హెల్" అని కలెక్టరు గేటువాడితో ఇంగిలీషులో నచ్చ చెప్పాడు

ఎట్లాగైతేనేం మేం బయటపడ్డాం.

"భద్రం!" అన్నాను.

"ఏం గురో?" అన్నాడు భద్రం నాకేసి దొంగల్లే చూస్తూ.

"మిష్టరీగా లేదూ?"

"మిష్టరీలన్న మిష్టరీలా, గురో!"

"సరేకాని ఇంగిలీషులో పిచ్చోడి అంటే ఏమిటి?"

"అంత యింగిలీసు నాకుమాత్రం వచ్చా గురో!" అన్నాడు భద్రం.

ఆలోచిస్తున్నాను. నేను పెద్దమనిషిని కని పెట్టిన ఆ కలెక్టరు, భద్రాన్ని ఎందుకు అట్లా చూశాడూ? మిష్టరీ! మహాశ్చర్యకరమైన మిష్టరీ!